షాపింగ్ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపన



దుకాణ సముదాయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం ఆవరణలో శుక్రవారం రెండు కోట్ల 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న దుకాణాల సముదాయం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రైతులతో పాటు చిరు వ్యాపారులకు, సంస్థలకు వివిధ రుణాలు అందించడంలో డీసీసీబీ ముందంజలో ఉందన్నారు. ఎప్పటికప్పుడు బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. త్వరితగతిన దుకాణాల సముదాయం నిర్మాణాలను పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, డీసీసీబి డైరెక్టర్ రాఘవేందర్ రెడ్డి, డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు ,బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా లబ్ధిదారుల ఎంపిక

భాగ్యనగర్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రజాపాలన కేంద్రాలను శుక్రవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా కార్యకర్తలు పర్యవేక్షించాలన్నారు. ప్రజా పాలనకు నిదర్శనమే నేటి కాంగ్రెస్ ప్రభుత్వ విధానమన్నారు. శంషీగూడ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలించారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శంషీగూడలోని ప్రజాపాలన కేంద్రంలో జగదీశ్వర్ గౌడ్ తదితరులు

‘ఎల్లమ్మచెరువు’ పనులు ఇక వేగిరం

- నిర్మాణ సంస్థతో మాట్లాడిన ఎమ్మెల్యే గాంధీ
- మురుగునీరు తరలించేందుకు చెరువు చుట్టూ యూజీడీ నిర్మాణం
- చెరువుకట్ట బలోపేతం, గ్రీనరీ, వాకింగ్‌ట్రాక్ నిర్మాణం



ఖాజాగూడ సాయిఐశ్వర్య, సాయివైభవ్‌కాలనీ చెంతన ఉండే ఎల్లమ్మ చెరువు


రాయదుర్గం: ‘ఎల్లమ్మచెరువు’ పరిసరాల రూపురేఖలే మారిపోనున్నాయి. సుందరీకరణ పనుల్లో మళ్లీ వేగం పెంచేలా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ చొరవ తీసుకుంటున్నారు. ఈ చెరువు సుందరీకరణకు ముందుకొచ్చిన నిర్మాణ సంస్థ మళ్లీ పనులు చేపట్టేలా చూశారు. పనులు ఏడాదిలో పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి.

- మణికొండలోని ల్యాంకోహిల్స్ బహుళ అంతస్తుల భవనాలు, చిత్రపురికాలనీకి ఆనుకొని ఖాజాగూడలోని సాయిఐశ్వర్య, సాయి వైభవ్ కాలనీల చెంతనే ఉండే ‘ఎల్లమ్మచెరువు’ భవిష్యత్‌లో షూటింగ్ స్పాట్‌గా మారడం ఖాయంగా కనిపిస్తోంది.
- కాలనీవాసులే కాకుండా ఇతర ప్రాంతాల వాసులు కూడా ఇక్కడకి వచ్చి సేద తీరేలా, పక్షులు కూడా దీన్ని ఆవాసంగా మార్చుకునేలా రూపొందించాలని అధికార యంత్రాంగం, నిర్మాణ సంస్థ కూడా యోచిస్తున్నట్లు సమాచారం.

సుందరీకరణలో భాగంగా చేపట్టే పనులు

- ఎల్లమ్మ చెరువు మధ్యలో ‘హైల్యాండ్’ ప్రత్యేక ఆకర్షణగా మార్చేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.
- చెరువు కట్టను మరింత బలోపేతం చేయాలని సంకల్పించారు.
- చెరువు చుట్టూ వాకింగ్ చేసేలా వాకింగ్ ట్రాక్, ఆహ్లాదపూరిత, ఆకట్టుకునేలా పచ్చదనం, పూల మొక్కలతో తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.
- చెరువులోకి మురుగునీరు రాకుండా ఉండేలా చెరువు చుట్టూరా మురుగునీటి కాలువ నిర్మాణం చేపడతారు.

దశలవారీగా అన్ని చెరువులను సుందరీకరిస్తాం



నియోజకవర్గంలో అన్ని చెరువులను దశలవారీగా సుందరీకరించేందుకు చర్యలు చేపడతాం. మాదాపూర్‌లోని దుర్గంచెరువు, రాయదుర్గంలోని మల్కంచెరువు, ఖాజాగూడలోని పెద్ద చెరువు తరహాలో ఆహ్లాదపూరిత వాతావరణం నెలకొల్పేలా చేస్తాం. స్థానికుల సహకారం, నిర్మాణ సంస్థల తోడ్పాటుతో అధికారుల పర్యవేక్షణలో ఈ పనులు సాగేలా చొరవ తీసుకుంటున్నాం.ప్రత్యేకంగా థీమ్‌పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. దశలవారీగా అన్నింటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

–ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి

మల్లన్న జాతర ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీలోని బండల మల్లన్న జాతర మహోత్సవ ఆహ్వాన పత్రికను శుక్రవారం ఆలయ ప్రాంగణంలో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. జనవరి 6,7 తేదీలలో జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘సండే ఈవింగ్ టాక్’

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో ఆదివారం ప్రత్యేక ‘సండే ఈవినింగ్ టాక్’ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ‘లెట్స్ గో, మూవ్ ఆన్ అండ్ క్రియేట్ యువర్ న్యూఇయర్’ అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపు డ్రంకన్ డ్రైవ్

- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్



ప్రత్యేక టీంలతో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్

హఫీజ్‌పేట్ : మద్యం తాగి వాహనాలతో రోడ్లపైకి రావద్దని చందానగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి 8 గంటల నుంచి తెల్లవారు జామున 3 గంటల వరకు ప్రత్యేక టీంలతో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించే వారు వాహనాలు నడపవద్దని హెచ్చరించారు.

లింగంపల్లి బ్రిడ్జి కల్వర్టు పనులు పరిశీలన



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద వరద ముంపు సమస్య పరిష్కారానికి రూ.4 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బాక్స్ కల్వర్టు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ గౌరవాధ్యక్షులు వీరేశంగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రాజుయాదవ్, పద్మారావు, యాదగిరిగౌడ్, నటరాజ్, గోపాల్‌యాదవ్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన.. రెండోరోజు 16,891 దరఖాస్తులు

గచ్చిబౌలి/శేరిలింగంపల్లి/ హఫీజ్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం రెండవ రోజు శుక్రవారం ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. శేరిలింగంపల్లి , చందానగర్ సర్కిళ్ల పరిధిలో 28 కేంద్రాలలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. శేరిలింగంపల్లిలోని పలు ప్రజాపాలన కేంద్రాలను శేరిలింగంపల్లి సర్కిల్ ప్రత్యేక అధికారి వాణిశ్రీ, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి పరిశీలించారు. రెండవ రోజు మొత్తం జంట సర్కిళ్ళ పరిధిలో 16,891 దరఖాస్తులు వచ్చాయి.శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో రెండవ రోజు మొత్తం 7,900 దరఖాస్తులు రాగా అందులో 6700 దరఖాస్తులు ఆరు గ్యారంటీల కోసం రాగా 1,200 దరఖాస్తులు ఇతర అంశాలపై దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా చందానగర్ సర్కిల్ పరిధిలో మొత్తం 8,991 దరఖాస్తులు కాగా అందులో ఆరు గ్యారంటీల కోసం 6,818 దరఖాస్తులు, 2,173 దరఖాస్తులు ఇతర అంశాలపై వచ్చాయి. అక్కడక్కడా సందడి కనిపించినా కొన్ని చోట్ల కాలనీలవారిగా స్పష్టంగా చెప్పడంతో వారే వచ్చి దరఖాస్తు చేసుకోవడంతో ఇబ్బందులు లేకుండా ప్రజాపాలన కార్యక్రమం సాగుతోంది.

మియాపూర్ : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌లోని మయూరినగర్ కాలనీ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రంను ఆయన పరిశీలించారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు.ఆయన వెంట మియాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్, నాయకులు చంద్రిక ప్రసాద్‌గౌడ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



మయూరినగర్ వార్డు కార్యాలయంలో ..

హఫీజ్‌పేట్ : ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో పాపిరెడి కాలనీలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి ఆయన పరిశీలించారు.

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, బీఆర్‌యస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెక్కులు పంపిణీ

జిన్నారం(పటాన్‌చెరు): కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేదలైన ఆడపిల్లల తల్లిదండ్రులకు వరంగా మారాయని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన జిన్నారం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల పరిధిలోని వారికి కల్యాణలక్ష్మి చెక్కులు, అదేవిధంగా గతంలో భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులు 30 మందికి మంజూరైన రూ. 96 వేల నష్టపరిహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి, హనుమంతరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పాలి

- భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



శ్రీద వరాళి

రాయదుర్గం: శాస్త్రీయ నృత్యకళలు, భారతీయ సంస్కృతిని ప్రపంచానికి మరింతగా చాటి చెప్పాల్సిన అవసరం ఉందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి డాక్టర్ రామినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో శ్రీద వరాళి చదలవాడ కూచిపూడి రంగప్రవేశం ఆద్యంతం అందరినీ ఆకట్టుకునేలా సాగింది. వినాయకనిను విన అంటూ నర్తకి తొలి నాట్య ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. వెంకయ్యనాయుడు నృత్యప్రదర్శనను తిలకించి ఆమెను ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యాలైన కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ తదితరాలను మనం కాపాడుకోవాలని, మన పిల్లలకు నేర్పించే బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ రఘురామకృష్ణంరాజు, రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మప్రచారక్ రామినేని, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి, సినీ దర్శకులు రాఘవేంద్రరావు, మాజీ కేంద్ర విజిలెన్స్ కమిషనర్ కేవిచౌదరి, సినీ నృత్య దర్శకులు కెవి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. నృత్య ప్రదర్శనలు





మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళాలో భాగంగా శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ సౌజన్యంతో రాజస్థాన్‌కి చెందిన కిరణ్ బృందం చక్రి నృత్యంతో ఆకట్టుకున్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన జానపద నృత్యం కర్గం, కావడి, తప్పాటం అంశాలు ఆకట్టుకున్నాయి. వనజా ఉదయ్ శిష్యబృందం, కరుణ శిష్యబృందాలు కూచిపూడి నృత్యప్రదర్శనలతో అలరించారు. కోల్‌కత్తాకు చెందిన డాక్టర్ దెబీజాని ఛటర్జీ బృందం ప్రదర్శించిన భరత నాట్యాంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో సత్తా చాటాలి

- మాస్టర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొండ విజయ్ కుమార్

హఫీజ్‌పేట్ : రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో రంగారెడ్డి మాస్టర్ అథ్లెట్ సత్తా చాటాలని మాస్టర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొండ విజయ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో నిర్వహించిన మాస్టర్స్ ఎంపిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ నెల 30,31వ తేదీలలో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే రంగారెడ్డి జిల్లా టీం సభ్యుల ఎంపికతో పాటు ఎంపికైన వారికి ట్రాక్ సూట్లను కార్యదర్శి సురేందర్, ట్రెజరర్‌లతో కలిసి ఆయన అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తుమ్మల ఏసురత్నం, లీలావతి, నాగలక్ష్మి, మానస, జ్యోతి, జితేందర్ పటేల్ పాల్గొన్నారు.



క్రీడాకారులకు ట్రాక్ సూట్‌లను అందజేస్తున్న విజయ్‌కుమార్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓయు కాలనీ, గోల్డెన్ తులీప్, కెఎంఆర్ ఎస్టేట్స్, కాంతివనం, సెంట్రల్ పార్క్ 2,3, మాధవహిల్స్, శ్రీరాంనగర్ సీ బ్లాక్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 25, పచ్చిమిర్చి 50, బెండ 60, కాకర 60, దొండ 70, దోస 40, ఆలు 25, చామ 50, కీర 25, బీర 70, వంకాయ 60, గోకర 70, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 40 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 250, వెల్లుల్లి 250.

మట్టి తరలిస్తే కఠిన చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిన్నారం ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ అన్నారు. మట్టి తరలింపు విషయంపై సాక్షి పత్రికలో కథనం ప్రచురితం కావడంతో శుక్రవారం తహశీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ మట్టి తరలింపు విషయమై ఆరా తీశారు. మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోలర్ స్కేటింగ్‌లో గీతం విద్యార్థిని ప్రతిభ

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్స్‌కి చెందిన బీఏ విద్యార్థిని రియా సబూ రోలర్ స్కేటింగ్‌లో బంగారు, రెండు రజిత పతకాలను గెలుచుకుంది. ఇటీవల చెన్నయ్‌లో నిర్వహించిన 61వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన ఆమె అత్యుత్తమ ప్రదర్శనను చాటింది. హ్యుమానిటీస్ డైరెక్టర్, స్పోర్ట్ డైరెక్టర్లతో పాటు విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

న్యూఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు

- మాదాపూర్ డీఐ జి.వెంకట్
- అనుమతులున్న ఈవెంట్‌లలో పాల్గొనాలి

మాదాపూర్: నూతన సంవత్సర వేడుకలను పూర్తి భద్రత ఉన్న ప్రాంతాలలో మాత్రమే చేసుకోవాలని మాదాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ) జి. వెంకట్ సూచించారు. మద్యంమత్తులో సెల్‌ఫోన్‌లో అసభ్యకర ఫొటోలు, వీడియోలు తీసుకుని షేర్ చేయొద్దన్నారు. నూతన సంవత్సర వేడుకలను నిర్వహించేందుకు 10 దరఖాస్తులు వచ్చాయన్నారు. వేడుకల్లో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సెక్యూరిటీ సిస్టం లేకుండా, సీసీ కెమెరాలు లేని ప్రాంతాలలో వేడుకలకు వెళ్ళవద్దన్నారు. పూర్తి స్థాయిలో అనుమతులు ఉన్న ఈవెంట్‌లకు మాత్రమే వెళ్ళాలని చెప్పారు.

- ఆన్‌లైన్‌లో ఈవెంట్‌ల గురించి పూర్తి సమాచారం తెలుసుకోకుండా టికెట్‌లను బుక్ చేసుకోవద్దు.





మాదాపూర్ డీఐ జి.వెంకట్

- బయటికి వచ్చిన యువత ఎప్పటికప్పుడు ఇంట్లో పూర్తి సమాచారం అందించాలి.
- మద్యం మత్తులో గొడవలు పడరాదన్నారు.
- సెల్‌ఫోన్‌లలో డేటాను ఇతరులకు షేర్ చేయొద్దు
- అమ్మాయిలు దుస్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి
- ఈవెంట్‌లు జరిగే సమయంలో అప్రమత్తంగా ఉండాలి
- వేడుకల సందర్భంగా కొంతమంది డ్రగ్స్ వాడుతున్నారు. దొరికితే చర్యలు తప్పవన్నారు.
- ప్రమాదాలు, అసభ్యకర కార్యక్రమాలు జరిగితే పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయాలి.

తైక్వాండో పోటీలకు ఒయాసిస్ స్కూల్ బాలికలు



తైక్వాండో పోటీలలో బంగారు పతకాలను సాధించిన విద్యార్థినులు

రాయదుర్గం: తైక్వాండో జాతీయస్థాయి పోటీలకు రాయదుర్గంలోని ఒయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ బాలికలు ఎంపికయ్యారు. స్కూల్‌లో పదవ తరగతి చదివే ఆధ్యామేఘన అండర్–17 బాలికల విభాగంలో బంగారు పతకం, ఆరవ తరగతి చదివే సమన్విత అండర్–14 బాలికల విభాగం తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలో బంగారు పతకాలను సాధించారు. వీరు వికారాబాద్ జిల్లా తాండూరులో జరిగిన పోటీలలో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించడంతో వారిద్దరిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి పోటీలను మధ్యప్రదేశ్ రాష్ట్రం బేతుల్‌లో డిసెంబర్ 31 నుంచి జనవరి 5వ తేదీ వరకు ఈ పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో రాష్ట్రం నుంచి వీరిద్దరు పోటీల్లో పాల్గొంటారు. వీరిద్దరిని ఒయాసిస్ స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపల్, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్థికసాయం అందజేత

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని జయశంకర్‌కాలనీలో నివసించే సునీత అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కటిక రవి, దేవేందర్, ఫజల్, తులసిరామ్, తదితరులు పాల్గొన్నారు.

6వరకు దరఖాస్తుల స్వీకరణ

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో గ్రామాల్లో కార్యదర్శి, అధికారులు ప్రధాన పాత్ర పోషించాలని ఎంపీడీవో బన్సీలాల్ అన్నారు. మండలంలోని పెద్దకంజర్ల, చిన్నకంజర్ల గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... జనవరి 6 వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా పటాన్‌చెరు మండలం పాటి, ఘనపూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, ఎంఈఓ రాథోడ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: శ్వాసకోస వ్యాధితో బాధపడుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఒరిస్సాకు చెందిన కృష్ణ (59) రెండు నెలల క్రితం పటాన్‌చెరు మండలం ఇంద్రేశంకు వచ్చి గ్రామ శివారులో ఇటుక బట్టీల వద్ద పని చేసుకుంటూ,అక్కడే ఉంటున్నాడు.ఈ క్రమంలో గత కొంతకాలంగా శ్వాసకోస వ్యాధితో బాధపడుతున్న కృష్ణ శుక్రవారం ఉదయం పడుకున్న చోటే మృతి చెంది కనిపించాడు.దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు ఈశ్వర్ తన తండ్రి గత కొంతకాలంగా శ్వాసకోస వ్యాధితో బాధపడుతున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గచ్చిబౌలి: డ్రంకన్ డ్రైవ్‌లో, డ్రైవింగ్ లైసెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నవారు లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, రాయదుర్గం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ కోరారు. శనివారం కూకట్‌పల్లి కోర్టులో నిర్వహించే లోక్‌అదాలత్‌లో హాజరైతే కేవలం జరిమానాతో క్లోజ్ చేస్తారని వారు సూచించారు డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఉన్నవారు వారి ఆధార్‌కార్డు జిరాక్స్, లైసెన్స్, వెహికిల్ ఆర్‌సీలను,.. డ్రైవింగ్ లైసెన్స్ కేసులు ఉన్నవారు ఆధార్‌కార్డు, వెహికిల్ ఆర్‌సీ జిరాక్స్ తీసుకొని వచ్చి తమ కేసులను క్లోజ్ చేయించుకోవాలని వారు సూచించారు.

తమిళనాడు వరద బాధితులకు చేయూత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తమిళనాడు వరద బాధితులకు తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ సభ్యులు అండగా నిలిచారు. తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 5 లక్షల విలువైన దుస్తులను సేకరించి శుక్రవారం లారీల్లో పంపారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు.గతంలో సైతం వరద బాధితులకు అండగా నిలిచామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యవర్గ సభ్యులు దీప్తి, కతిరేసన్, రవికిరణ్, రవి, రమణ పాల్గొన్నారు.